

# గుళికలు

రమానాథ్ కందాళ

## గుళికల గురించి

| | |
|---|---|
| కుదురు రోగము: | అపూర్వ ప్రయోగములైనందున అనిర్ధారితము. |
| పదార్థములు - పాళ్ళు: | మీకు తెలిసిన మాకు తెలియచేయ మనవి |
| వాడకము: | నెలకో గుళిక |
| వాడుక సూచన: | గొంతునకడ్డము పడకుండ మింగవలెను. |
| హెచ్చరిక: | వికటించవచ్చు. వ్యసనలోలత కి అవకాశమున్నది. |



## జల సంభవుడు

అనగా అనగా ఒక ఊరు. ఆ ఊళ్ళో ఒక చిన్న చెరువు. ఆ వేళ చెరువులోపల ఏదో జాతర జరుగుతున్నట్టు కోలాహలంగా ఉంది. రకరకాల రంగురంగుల చేపలు గుమిగూడుతూ అంతలోనే చెదిరిపోతున్నాయి. ఒకచోట నిలవలేకపోతున్నాయి. విడిపోతున్నాయి. కలుస్తున్నాయి. ముందుకుపోయినట్టే పోయి తక్కున వెనక్కి తిరిగొస్తున్నాయి.

ఈ సందడికి కారణం కొద్దిసేపట్లో జరగబోయే మత్స్య మహాసభ. సభంటే సందడే మరి. పూజకి మంత్రంలా సభకి సందడి ప్రధాన సంజ్ఞ.

కొద్దిసేపటికి ఓ చేపకొటి ముందుకొచ్చి సభ ప్రారంభమవుతోందని ప్రకటించింది. దాని పేరు జలసంభవుడు. అది చేపల నాయకుడు. ప్రకటన వినగానే సభిక చేపలు అప్రమత్తమయ్యేయి.

ఓసారి సభని కలియచూసి జలసంభవుడిలా అన్నది.

"నా ఎరికన ఇటువంటి సభ అడపాదడపా తప్ప జరగలేదు. కొన్నాళ్ళ కిందట మన చెరువులో జలాభావ పరిస్థితులొచ్చినప్పుడొకసారి, అప్పుడెప్పుడో మరెందుకో మరోసారి జరిగేయి. సరిగ్గా గుర్తులేదు. విషయవేవిటంటే దేవుడు మనిషి గానూ మరోటి గానూ రాకముందు సృష్ట్యాదిలో చేపై వచ్చేడని పెద్దలు చెపుతారు.".

దేవుడి ప్రసక్తి కి సభలో సెగ రేగింది.

"ఆ వచ్చింది వేదోద్ధరణకా చేపోద్ధరణకా? " అందో చేప నిష్టూరంగా

"దేవుడు చేపవడం వల్ల చేపలకేం ఒరిగింది? " అంది మరో చేప

"తన పుస్తకాలు కూడా తను కాపాడుకోలేని వాణ్ణి సృష్టికర్త చెయ్యడంలోనే తెలియడంలేదూ తెలివంతా!" అని మరోటి,

"ఒకనాడు దేవుడు చేపయ్యేడు.. అంచేత కొంగలూ కొంగలూ ఇవాళ మమ్మల్ని తినకండేం అంటే ఏకొంగ మానుతుందేం?" అని ఇంకోటి.

ఇలా సెగ రగిలి భగ్గుమనబోయింది.

జలసంభవుడు కలగచేసుకుని "శాంతించండి. నిజమే.. కొంగ ధర్మం చేపకి న్యాయం కాదు. అంతవరకెందుకు? మన్లో మన మాట. సొరచేప ధర్మం చిరుచేపకి న్యాయంగా తోస్తుందా? దానికి దేవుడు చేసేదేదన్నా ఉందనుకుంటే మీ ఇష్టం. విషయమేవిటంటే అవయవశూన్యాలైన సూక్ష్మతమజీవులు ముందు ఎన్నున్నప్పటికీ స్థూలంగా చెప్పాలంటే ఇప్పటికి సృష్టి పరిణామంలో చేప మొదటిది. మనిషి కడపటి వాడు" అన్నది.

మనిషి అన్న మాట వినబడగానే సభలో మళ్ళీ భగ్గుమంది.

"కొంగా గింగా అనుకానీ మనిషి మాటెత్తద్దు"

"కొంగలకి ధర్మవున్నదేమో కానీ .. మనిషి పాటించేది ధర్మవా? ..ఛీ"

"ఎరలూ వలలూ కొంగలు వెయ్యవు.. మహా అయితే ముక్కుకో చేప.. మనిషి వట్టి ఆశపోతు"

"వాడు సృష్టి పరిణామం కాదు. సృష్టికి వ్రణం."

ఇలా రకరకాల నిందావాక్యాలు వినబడ్డాయి. ఎండుజిల్లేడుకాయలో రసంలా దేవుడి మీదా మనిషి మీదా సానుభూతి బొత్తిగా మృగ్యమైంది సభలో.

అన్నీ విని జలసంభవుడు శాంతంగా "మీ మాటల్లో సబబు లేదనడానికి నా అనుభవం ఒప్పదు. కానీ మనిషితో కలుపుకుని మనమంతా ఒకే సృష్టి సంతానం. సంతానంలో కనిష్టుడి బాధ్యత ఒక్కోసారి ప్రథముడు వహించాల్సి వస్తుంది. వాడి అవసరాలు తీర్చాల్సి రావడంతో పాటు మంచీచెడూ చెప్పాల్సి వస్తుంది. అటువంటి అవసరం ఇప్పుడొకటి ఆసన్నమైంది" అంది.

చేపలు మొహ మొహాలు చూసుకున్నాయి. మనిషికి బుద్ధిగరపడమంటే అసాధారణ క్రియ. అందులోనూ చేపలకి. వేటాడి తినేవాడి ఎదట కోరిపడి ఏ సూక్తులు వచించగలం? సహజవైరి సహవాసం అసంభవమని జలసంభవుడెరగడా? కాకపోతే జలసంభవుడు నమ్మకమైన పాలకుడు, అనుభవజ్ఞుడు, అసత్యవాది కాడు. చెప్పనీ చూద్దాం అన్నట్టూరుకున్నాయి చేపలు.

జలసంభవుడు చెప్పుకు పోయింది.

"ఆహార నిద్రా భయ మైథునాలలో మనకీ మన కనిష్టుడికీ పెద్దగా తేడా లేదు. మనని వాణ్ణుంచి వేరు చేసేది బుద్ధి అని వాడి నమ్మకం. కానివ్వండి. ఎవడి కన్ను వాడికి ప్రమాణం. దానికి తగవెందుకు. కాని రాను రాను మనిషి బుద్ధి గడ్డి తింటోంది. వెర్రితలలు వేస్తోంది. తన అవసరాలు తీరుస్తున్న సహజీవులని లెక్కా పద్దూ లేకుండా మనిషి విధ్వంసం చేస్తున్నాడు. సహజీవనానికి ప్రాథమిక సూత్రం సంతులనమని ఎరగకుండా ఉన్నాడు. వాడు వేస్తున్న వలల్లో పడి మనవాళ్ళు వేలకు వేలు మాయమవుతున్నారు. మత్స్యజాతి మనుగడ చిక్కుల్లో పడ్డది. ఈ ఊపున కొల్లగొట్టుకుంటూ పోతే మనకీ బతుకుండదు, తనకీ ఎంతో కాలం గడవదు. విచక్షణ పాటించమని, పరిధెరిగి మసలుకొమ్మని అది మీరితే ఉభయత్రా బాగా జరగదని మనం తనకి నచ్చజెప్ప వలసున్నది." అన్నది.

అందులో హితవుంది. బెదిరింపు లేదు. బెదిరించి సాధించే కార్యాల్లో ఏ మాత్రం గుణం ఉంటుంది? పైగా ఇది బెదిరించి సాధించదగ్గ కార్యం కాదని కుడా తను ఎరుగును.

సభలో నిశ్శబ్దం పేరుకుంది. పిల్లి మెళ్ళో గంట సంగతి తెలుసు కనక జలసంభవుడు నిరుత్సాహ పడలేదు. ఓ సారి తల పంకించి "జాగ్రత్తగా వినండి. ఈ చెరువున్న ఊరికి రాజు ధీశాలి, వివేకి, భూతదయాపరుడు, దూరాలోచన గలవాడు. తన పరిపాలనలో ఇటువంటి అతిక్రమణ జరుగుతోందని తెలిసి ఉపేక్షించే వ్యక్తి కాడు. హద్దులమలు పరచగల శక్తి గలవాడు. విహారార్థవై తను ఈ చెరువు వైపు రేపుదయం రానున్నట్టు కబురు తెలిసింది. మనం కొంతమంది తన ఎదటపడి పరిస్థితి మనవి చేద్దాం" అన్నది.

చేపలకి పాలు పోలేదు. చెయ్యచ్చు. కానీ రాజులకి వచ్చే బుద్ధీ పొయ్యే బుద్ధీను. అంతలోనే కరుణ.. అంతలోనే కన్నెర. రాచమంతనం మాటలు కాదు. తల తెగిపోతుంది. ఇంతెందుకు. మనిషి గురించిన మొరేదో దేవుడితో పెట్టుకుంటే..కానీ.. దేవుడైనా ఏం లాభం? మనిషికి గుండె ఒక్కటే రాయనుకుంటే దేవుడికి ఒళ్ళంతా రాయే. రాతి అవతారపు దేవుడికి చలనవా చచ్చు బండలా. తూలనాడే వాళ్ళు ఆడుతూనే ఉన్నారు, మాలలేసే వాళ్ళ వేస్తూనే ఉన్నారు. ఓమాటా, మంతా? ఇలా పరిపరివిధాల కాసేపు పోయేయి.
చివరకి జలసంభవుడి మీద నమ్మకం కొద్దో, మనిషి మీద మంట కొద్దో, దేవుడి మీద నిస్పృహ కొద్దో తటపటాయించినా సరే అన్నాయి.

ఆ తర్వాత ఏంజరిగిందీ అనేది లోక విదితం.

మర్నాడుదయం అనుకున్నట్టుగా రాజుగారు విహారానికి రాలేదు. ఆయన ఏడుగురు కొడుకులూ మటుకూ వచ్చేరు. విహారానికి కాదు, వేటకి. వేటకొచ్చి జలసంభవుడితో సహా ఏడు చేపలని వేటాడి తీసుకుపోయేరు. ఏడు చేపల్నీ ఎండబెట్టేరు. వాటిల్లో జలసంభవుడు ఎండలేదు. ఏవని అడిగితే నోరు తెరిచి అతి కష్టమ్మీద బుద్ధీ, గడ్డీ అని ఏదేదో పలవరింతగా అంది. పోవాల్సిన ప్రాణవే. కర్తవ్యదీక్ష కాసేపుణ్ణిచ్చింది. రాజుగారి కొడుకులు గడ్డి విన్నారు కానీ బుద్ధి వినలేదు. అంచేత పక్కనే ఉన్న గడ్డివామునీ, ఆవునీ, అమ్మనీ, పిల్లాణ్ణీ ,అలా అలా చివరకి చీమనీ అడుక్కుంటూ పోయేరు. అడిగిందే తడవుగా గడుసు చీమ చెప్పుచ్చుకు కొట్టినట్టు రాజుగారి కొడుకుల్ని ఓ సమాధాన ప్రశ్న వేసి జలసంభవుడి కార్యం తను తీర్చింది. ఆ సమాధానప్రశ్నతో మనిషికి బుద్ధొచ్చిందా అంటే రావాలనే కాదూ మరి ఏ ప్రయత్నవైనాను?.